విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 15, మార్చి 2023

ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమైన స్కీమ్ కార్మికులు

విశాలాంధ్ర - నందికొట్కూరు : సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం ధరలకు అనుగుణంగా స్కీం వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుచేయలని, ఆశ అంగన్వాడి మధ్యాహ్నం కార్మికులపై రాజకీయ వేధింపులు,అక్రమ తొలగింపులు ఆపాలని కోరుతూ మార్చి 17న చలో అసెంబ్లీ నిర్వహించి మహాధర్నా కార్యక్రమాన్ని స్కీం కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటియుసి నంద్యాల జిల్లా అధ్యక్షులు వి.రఘురామూర్తి కార్మికులకు పిలుపునిచ్చారు.మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని పాఠశాలలను సందర్శించి స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అంగన్వాడీలకు తెలంగాణలో ఇస్తున్నవేతనం కంటే అదనంగా వెయ్యి చెల్లిస్తానని చెప్పి, నేడు తెలంగాణ రాష్ట్రం కంటే 2000 తక్కువ వేతనాలు చెల్లిస్తు మాట తప్పారన్నారు. కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు అంగన్వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేస్తూ జీవో ఇచ్చిందని, జగన్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫుడ్ కమిషనర్ ప్రతాప్ రెడ్డి పరిసిలనల హడావుడి మానుకోవాలని చిరుద్యోగులపై ఎటకారంగా మాట్లాడడం మానుకోవాలని , చేతనైతే అంగన్వాడీ సెంటర్లలో, మధ్యాహ్నం భోజనం పిల్లలకు పెట్టే మెనూ సరుకులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు కేంద్ర

ప్రభుత్వం జీఎస్టీ పేరుతో మహిళల శానిటరీ నేప్కిన్స్ పై కూడా పన్నులు వేస్తూ, పెట్రోల్ డీజిల్,గ్యాస్ ధరలను రోజురోజుకీ పెంచుతూ నిత్యవసర సరుకులు ధరలను విపరీతంగా పెంచుతుందని విమర్శించారు. పేస్ యాప్ రద్దు చేయాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. స్కీం కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి,62 సంవత్సరాలకు వయోపరిమితి పెంచి ,రిటైర్మెంట్ బెనిఫిట్స్ ,పీఎఫ్ ,ఈఎస్ఐ పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి మహానంది, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు వీరేంద్ర,దినేష్,వినోదులు పాల్గొన్నారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో తొలగించిన శానిటేషన్ కార్మికులను వెంటనే విధుల్లోకి

తీసుకోవాలని ఎఐటీయుసి నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఫిబ్రవరి 15న శానిటేషన్ వర్కర్లు తొలగించడం జరిగిందన్నారు. గత కొన్ని నెలలగా ప్రభుత్వ హాస్పిటల్ లో పనిచేస్తున్నటువంటి శానిటేషన్ కార్మికులను నిర్లాక్షణంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం హేమమైన చర్య అని దీనికి బాధ్యులు ప్రభుత్వ హాస్పిటల్ సూపరిండెంట్, అధికారులు, కాంట్రాక్టర్లు, శానిటేషన్ వర్కర్లను తీసివేయడానికి వీరే బాధ్యులని ఏఐటీయూసీగా భావిస్తున్నామని తెలిపారు.తక్షణమే వీరిని వెంటనే విధులకు తీసుకొని శానిటేషన్ వర్కర్లకు న్యాయం చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. శానిటేషన్ వర్కర్లు సుశీలమ్మ, వెంకట రమణమ్మ, నాగేంద్రమ్మ, సావిత్రి, గోవిందపల్లి రాణి పాల్గొన్నారు.

ధరలు తగ్గించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - నంద్యాల : నేటి నుండి జరిగే రాష్ట్ర బడ్జెట్లో ప్రజా కార్మిక కర్షక

రైతులకు ఉపయోగపడే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ కోరారు. పుదుచ్చేరి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల కష్టాలు ఎరిగి రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నెలకు ఒక గ్యాస్ సిలిండర్ పై 300 రూపాయలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రకటించిందని, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి 126 కోట్ల నిధులను పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎస్ రంగస్వామి ప్రకటించి సంచలనమైన నిర్ణయం తీసుకున్నాడని, అదేవిధంగా మన రాష్ట్రంలో జరిగే బడ్జెట్ సమావేశంలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న వంటగ్యాస్ మంటలనుండి రాష్ట్ర ప్రభుత్వం కాపాడి వంట గ్యాస్ సిలిండర్ పై సబ్సిడీకి నిధులు కేటాయించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థికి పతకం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణానికి చెందిన శ్రీగురు రాజా ఇంగ్లీష్

మీడియం స్కూల్ విద్యార్థి రాష్ట్రస్థాయిలో తైక్వాండో పోటీల్లో ప్రతిభ చూపిందని పాఠశాల డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు విశాఖప ట్నంలోని ఎలమంచిలో వైఎస్ ఆర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 40వ సబ్ జూనియర్ 5వ కేడట్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాల జిల్లా, నంద్యాల పట్టణానికి చెందిన శ్రీగురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని ఎస్.నీరజ సత్తాచాటి సిల్వర్ మెడల్ దక్కించుకుందని డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించడం తమ పాఠశాలకు గర్వకారణమని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎస్. నీరజ పథకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తంచేశారు. రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించిన విద్యార్థి ఎస్. నీరజ, అందుకు కృషి చేసిన కోచ్ ను పాఠశాల డైరెక్టర్ పి.షేక్షావలి రెడ్డి అభినందించారు.

శ్రీశైలం పాదయాత్రలకు అన్నదానం

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణంలోని ఆత్మకూరు రోడ్డు జమ్మి చెట్టు

దగ్గర వినాయక స్వామి దేవాలయం నందు మంగళవారం పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ చక్రపాణి ఆధ్వర్యంలో శక్తి పీఠాల్లో ప్రసిద్ధి శైవ క్షేత్రం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం శ్రీశైలంకు కాలినడకన వెళ్లే కర్ణాటక భక్తులకు మంగళవారం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, నందికొట్కూరు వ్యవసాయ సంచాలకులు విజయ శేఖర్, పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదానంలో మండల వ్యవసాయ అధికారి శ్రావణి, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, వైసిపి నాయకులు కిరణ్ కుమార్ రెడ్డి, కురువ శీను, భక్తులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా యూనిట్ లో పనిచేస్తూ

విదినిర్వహణలో మరణించిన రాజశేఖర్ (324) కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చేయడానికి వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా ప్రభుత్వం వారి నుండి గ్రూప్ పర్సనల్ ఆక్సిడెంట్ కింద 10,25,000/- ల చెక్కును నంద్యాల జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డి చేతుల మీదుగా రాజశేఖర్ భార్య కె.వెంకట లక్షమమ్మకు నంద్యాల జిల్లా పోలీసు కార్యలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిజాముద్దీన్, సూపరింటెండెంట్ ఖాదర్ వలి గారు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : భూ చట్టాలు, మహిళల చట్టాలపై

అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి తేజ సాయి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని స్నేహ స్టడీ సర్కిల్ నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోటర్ యాక్సిడెంట్ చట్టాలు, భూ చట్టాలు మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండి సమస్యలు ఎదురైనప్పుడు ఎలా పరిష్కరించుకోవాలని తెలుసుకోవచ్చన్నారు. ఈ సదస్సులో న్యాయవాదులు శ్రీధర్, మాణిక్యరావు, హుస్సేన్ మియా, స్నేహ అకాడమీ డైరెక్టర్ ఆశ పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం పై జాగ్రత్తలు తీసుకోండి

విద్యార్థుల్లో రక్తహీనతను గుర్తించి మెరుగైన చికిత్సలు అందించాలి

జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్

విశాలాంధ్ర - నంద్యాల : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో రక్తహీనతను గుర్తించి మెరుగైన చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళ వారం నంద్యాల పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్ లో జాతీయ నులిపురు గుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను విద్యార్థిని ,విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నా రు.మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, డీఎంహెచ్ఓ డా. వెంకటరమణ, డీఈఓ అనూరాధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో రక్తహీనతను గుర్తించడంతో పాటు కంటి చూపు, చెవుడు, చెవిలో చీము కారడం సమస్యలు, దంత సంరక్షణకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలను మెడికల్ అధికారులు, వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న 3,99,942 మంది పిల్లలందరికీ నులిపురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలను మింగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ఆల్ బెండ జోల్ - 400 మాత్రలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసుకోవడం వలన విద్యార్థుల జీర్ణాశయంలో వివిధ మార్గాల ద్వారా చేరిన అన్ని రకాల నులిపురుగులు,వాటికి సంబందించిన గుడ్లు నశిస్తాయన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం జిల్లా కలెక్టరు విద్యార్థులకు ఆల్ బెండ జోల్ - 400 ఎంజి మాత్రలు స్వయంగా వేశారు. జిల్లాలో మొత్తం 3,99, 942 మంది 1-19 సంవత్సరాల వయసు వారు ఉన్నారని,వారందరికి ఈరోజు మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలకు గైరు హాజరైన విద్యార్థులకు ఈనెల 18 వ తేది మాప్ అప్ రౌండ్ లో వేస్తామని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు నాయక్ కలెక్టర్‌కు నివేదించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, వినయ్, సిసిలియా, పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హానా, వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్,ఆరోగ్య సిబ్బంది మల్లికార్జున,వెంకటరమణ,వీరన్న పాల్గొన్నారు.

విశాలాంధ్ర - అవుకు : ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిది లోని ఏపీ మోడల్ స్కూల్ అవుకు నందు మంగళవారం ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ జి యమునా లు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సంధ్భముగా పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి అధికారి జామ్ ఖాన్, విద్యాధికారి శ్రీధర్ రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ అవుకు మండలం ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 6183 మంది పాఠశాల విద్యార్థులకు గానూ 5873 మందికి మరియు 2053 మంది అంగన్వాడి పిల్లలకు గాను 1988 మంది పిల్లలకు మొత్తం 8236 మంది కి గాను 7861 మంది పిల్లలకు 95% విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేయటం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ యన్ మల్లేశ్వరి ,హెల్త్ సూపర్వైజర్ ఆర్ వేణుగోపాల రాజు, ఏఎన్ఎంలు వెంకటేశ్వరమ్మ,దానమ్మ, తేరిసమ్మ ప్రధానోపాధ్యాయులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : నులిపురుగుల నివారణ కోసం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ నూర్జహాన్లు విద్యార్థులకు మింగించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మోడల్ స్కూల్లో 240 మంది విద్యార్థులకు మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పాఠశాలలోని విద్యార్థులకు, అంగన్వాడి కేంద్రాలలోని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను మింగించడం జరుగుతుందన్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగతంగా పరిశు భ్రంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పరిశుభ్రమైన నీరు, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదన్నారు. ఏదైనా తిన్న తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, హెల్త్ సూపర్వైజర్ దస్తగిరి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - జూపాడు బంగ్లా : విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం అల్బెగ్జాండర్ మాత్రలను మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ గంగాధర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రము పరిధిలోని అన్ని గ్రామములలోని అంగన్వాడి కేంద్రములు, ప్రభుత్వ పాఠశాలలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమము నిర్వహించినట్లు వైద్యాధికారి డా,, గంగాధర్ తెలిపారు. 1 సం,, నుండి 19 సం,, వయసు కలిగిన బాల బాలికలకు నులిపురుగుల నివారణ కై ఆల్బెండజోల్ మాత్రలను మింగించడం జరిగినది అని వారు తెలియజేశారు. మంగళవారం పాఠశాలకు రాని విద్యార్థులకు శనివారం రోజు న ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తామని డా,, సాబా తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రమైన నీటిని త్రాగాలని, అదేవిధంగా చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహారం తినాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈఓ మోహన్ , సిహెచ్ఓ వాహాబ్ , ఆరోగ్య పర్యవేక్షకులు రాముడు, ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయులు,ఆరోగ్య కార్యకర్తలు,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు,అంగన్వాడి కార్యకర్తలు,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - బనగానపల్లి :టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ఎస్ శివ శంకరుడు మరియు ఎంపిహెచ్ఈఓ వెంకటేశ్వర్లు టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య పరిధిలో అన్ని ప్రైమరీ ,అంగన్వాడీ, హై స్కూల్,మరియు జూనియర్ కాలేజీలు నులి పురుగుల దినోత్సవము జరపడం జరిగింది. నంద్యాల జిల్లా డీఎంహెచ్వో డాక్టర్.మల్లిఖార్జున రెడి టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య పరిధిలో అయిన కైప ఎలమెంట్రీ స్కూల్ నందు మరియు బనగానపల్లి బానుముక్కల హై స్కూల్, కేజీ విబి తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కే మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ 1-19 పిల్లలకు ఆల్బెండజోల్ మాత్ర వేయడం వల్ల రక్తహీనత,పోషక ఆహార లోప్యత గురి కాకుండా తమ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి ని అదే విధముగా పరిశు భ్రతను గురించి అవగాహన కల్పించడం జరిగింది.

విశాలాంధ్ర - చాగలమర్రి : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చాగలమర్రి పట్టణంలో మంగళవారం ఆయా పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగుల నివారణా మందులను పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అంజలి, ఇమ్రాన్ల ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జరిపారు. విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ. సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 1 నుంచి 19సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థిలు 9976 మంది ఉన్నారన్నారు. నులిపురుగుల నివారణ మందులను అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అనురాధ, హెచ్ వెంకటమ్మ, సూపర్వైజర్ రామచంద్రుడు ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, సిబ్బంది. పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా డిఐఓ డాక్టర్ ప్రభావతీ ప్రభుత్వ డిగ్రీ, ఎంపీపీ స్కూల్ వెంగళ రెడ్డి నగర్, అంగన్వాడీ సెంటర్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతులు కడుగటము, గోర్లు కత్తిరించడము, పరిశు భ్రత, పరిశుబ్రమైన నీరు, ఆహారము తీసుకొనుట గురించి వివరించారు. నులి పురుగుల నిర్మూలన కొరకు అలవెండాజెల్ 400ఎంజి మాత్రలు పిల్లలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎంఈఓ జనకిరామ్, మున్సిపాల్ ఛైర్మన్ డాక్టర్ ఆసియా మరుఫ్, మున్సిపాల్ కొమిషనర్ శ్రీనివాసులు, అర్బన్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ మహమూద్ బైగ్, హెల్త్ ఏడ్యూకేటెర్ ధనలక్ష్మి, ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి, లక్ష్మీదేవి, ఆశలు గౌరి, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రుద్రవరం : మండల పరిధిలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విద్యార్థులకు 100% నులి పురుగుల నివారణ మందులను ఇవ్వడం జరిగిందని వైద్యాధికారి బాబు తెలిపారు. మంగళవా రం మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని, నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్వాడీ చిన్నారులకు, ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మందులను ఇవ్వడం జరిగిందని ఆలమూరు వైద్యాధికారి అమర్నాథ్ రెడ్డి, నరసాపురం వైద్యాధికారి బాబు లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

17 న చలో అసెంబ్లీ విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బనగానపల్లి : స్కిమ్ కార్మికులు మార్చి 17న చలో అసెంబ్లీ

ముట్టడికి తరలి రావాలని ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి శివ బాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బాలకృష్ణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం ధరలు కనుక్కునంగా స్కీమ్ కార్మికులందరికీ కనీస వేతనం26000 రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆశ అంగన్వాడి మధ్యాహ్న కార్మికులపై రాజకీయ వేధింపులు అక్రమ తొలగింపులు ఆపాలని కోరుతూ17న చలో అసెంబ్లీ నిర్వహించి స్కిన్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నాయకురాలు సావిత్రి, లక్ష్మీదేవి, రామ లచ్చుమ్మ, పార్వతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ

తరగతి చదువుతున్న సాయిచరన్ అనే విద్యార్థి జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కోటయ్య తెలిపారు. ఈనెల 8వ తేదీన ఆళ్లగడ్డ వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనబరచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడని వివరించారు. ఈనెల 28 నుంచి ఛత్తీస్గఢ్ రాష్ట్రం బిలాయ్ నగరంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున విద్యార్థి పాల్గొననున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి ఎంపికకు కృషి చేసిన పీడీ దాదాపీర్, పీఈటీ భారతిలను అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణం సప్తగిరి షైన్ అపార్ట్మెంట్ లో 7వ తరగతి చదువుతున్న యశస్విని అనే విద్యార్థిని మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఓ ప్రైవేట్ స్కూల్ లో చదువుతున్న యశస్విని తనకు పరీక్షల్లో మార్కులు తక్కువగా రావడంతో మనస్తాపం చెంది, అలాగే ఆరోగ్యం కూడా బాగా లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థిని తండ్రి సేల్ టాక్స్ ఆఫీసులో పని చేస్తున్నాడు. ఈ మేరకు 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థుని మృతి చెందిడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

పట్టుబడిన వాహనాలు 16న వేలం

విశాలాంధ్ర - బనగానపల్లి: బనగానపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో మద్యం తరలిస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలను మరియు స్కార్పియో వాహనాన్ని 16న బహిరంగ వేలం వెస్తున్నట్లు బనగానపల్లె సెబ్ సీఐ సుభాషిని తెలిపారు. వేలం పాటలో పాలు దోల్చుకున్నవారు 3000 రూపాయల నగదు డిపాజిట్ చేయాలని డిపాజిట్ చేసిన వారికి అనుమతిస్తామని పేర్కొన్నారు.

అవధాని శర్మ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు పట్టణంలో ని స్టార్ యూత్

అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లల ఆశ్రమంలో మంగళవారం కీర్తిశేషులు అవధాని శంకర శర్మ 75 జయంతి వేడుకలు నిర్వహించారు. శర్మ కుటుంబ సభ్యులు భార్య రమాదేవి కుమారులు రాజా , రఘు , శరత్ లు పిల్లల కు మిఠాయిలు పంచి పెట్టారు. శర్మ అధ్యాపక వృత్తిలో ఉన్నప్పుడు విద్యార్థుల కు వారు చేసిన సేవలను కొనియాడారు. వారి ఆత్మ శాంతికి ప్రార్థనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది ఖాదర్ వలి , లక్ష్మీ , జయరాజ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో విశ్రాంత విఆర్ఓ మృతి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండలంలోని పారుమంచాల గ్రామానికి

చెందిన రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకొని రెడ్డి వెంకట్ రెడ్డి పార్థిహ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి వెంకట్ రెడ్డి మృతి చెందడం చాలా బాధాకరమని వారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్, నంద్యాల పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి రావూ ఫ్, మాజీ ఎంపీపీ మందడి వెంకటరమణారెడ్డి , శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, బుధవారం 15, మార్చి 2023

కౌంటింగ్‌లో పొరపాట్లు జరగకుండా సమర్ధవంతంగా నిర్వహించాలి

జేసీ ఎస్. రామసుందర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియ లో పొరపాట్లు జరగకుండ సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరంలోని చాణిక్యపురి కాలనీ లోని ఉద్యానభవన్ నందు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బందికి జరిగిన రెండవ విడత శిక్షణా కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి మరియు సంయుక్త కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం వారి ఎన్నికల నియమావళి పై రూపొందించిన మాన్యువల్ ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని పూర్తి అవగాహనను ఏర్పరుచుకోవాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 6 పోలింగ్ కేంద్రాల ద్వారా ఈ నెల 13వ తేదీ సోమవారం ఎన్నికలు నిర్వహించడం జరిగిందని ఇందుకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌ను కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్‌కి సంబంధించి ప్రతి అభ్యర్థి ఒక కౌంటింగ్ ఏజెంట్ ని నియమించుకోవచ్చన్నారు..కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ సమయంలో వాలిడ్ మరియు ఇన్ వాలిడ్ బ్యాలెట్ పేపర్ ను జాగ్రత్తగా గమనించి కౌంటింగ్ నిర్వహించాలని ఆదేశించారు.జడ్పీ సీఈవో మరియు మాస్టర్ ట్రైనర్ నాసర రెడ్డి మాట్లాడుతూ శాసనమండలి ఓట్ల లెక్కింపుప్రక్రియ కు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా అవగాహన

కల్పిస్తూ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు కు ఏర్పా టు చేసిన ప్రతి టేబు ల్ కు సిబ్బంది ఉంటారని, కౌంటింగ్ పర్సనల్స్ కౌంటింగ్ కేంద్రంలోనికి పెన్ను ను తీసుకొని వెళ్ళడానికిఅనుమతి లేదని తెలిపారు.. ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రాథమికం గా మొదట పోస్టల్ బ్యాలెట్ అనంతరం బ్యాలెట్ పేపర్లను కట్టగా కట్టి పోలింగ్ స్టేషన్ ల వారీ గా ట్రేలో వెయ్యాలని తరు వాత పోస్టల్ బ్యాలె ట్ పేపర్లు మరియు పోలింగ్ స్టేషన్స్ వారీ గా కట్టలు కట్టిన బ్యాలెట్ పేపర్లు ను మొత్తం కలిపి అభ్య ర్థుల వారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు.కౌంటింగ్ మాన్యు వల్ లోని ప్రతి లైన్ ను క్షుణ్ణంగా చదివి కౌంటింగ్ పర్సనల్స్ అర్థం చేసుకోవాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పర్యావరణకు హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ నిషేధించిలని ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పిలుపునిచ్చారు ఎమ్మిగనూరు మున్సిపల్

కార్యాలయం నందు జీఏటీ గ్రీన్ అలియాన్స్ బయోటెక్ సంస్థ ఉత్పత్తి బయోడీగ్రేడబుల్ మరియు కంపోస్టు కవర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు .అనంతరం వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ మన జీవితంలో ప్రవేశించినాటి నుంచి పర్యావరణా సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు .ప్లాస్టిక్ కారణంగా మనుషలతో పాటు పశు పక్షాదుల జీవన విధానం ప్రశ్నార్థకంగా మారింది. పర్యావరణాన్ని పరిరక్షించుకొని భవిష్యత్తు తరానికి ప్లాస్టిక్ రహిత సమాజన్ని అందించాలంటే బయో కవర్లను వినియోగించాలని కోరారు . హెూటల్స్ లో ప్లాస్టిక్ కవర్లలో వేడి వేడి ఆహార పదార్థాలను వాడటం వలన 52 శాతం క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని ఇప్పటికే ఆరోగ్య నిపుణులు సూచించారు. ప్రభుత్వాలు కూడా ప్లాస్టిక్ పైన పూర్తిగా నిషేధం విధించారు .ఇప్పటికైనా ప్రజలు వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడటానికి స్వస్తి పలకాలని పర్యావరణానికి ఆరోగ్యానికి మేలు చేసే బయో డీగ్రెడబుల్ కవర్లు వాడాలని వారు తెలియజేశారు.

అభిమానుల సంబరాలు

విశాలాంధ్ర - హెూళగుంద : బీఆర్ఆర్ఆర్ మూవీకి ఆస్కార్ అవార్డు వచ్చిన సందర్భంగా బస్టాండ్ లో నందమూరి జూనియర్ ఎన్టీఆర్ ,మెగా అభిమానులు కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు పంచుకొని మంగళవారం సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి మండల అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ సినిమాకు ఆస్కార్ రావడం చాలా సంతోషకర మన్నారు. ఇలాంటి ఆస్కార్ అవార్డులు ప్రతి ఒక్క హీరో మన సినిమా ఇండస్ట్రియల్ కు గుర్తింపు తీసుకు రావాలని కోరారు.రాబోయే రోజుల్లో ఇలాంటి మంచి మంచి సినిమాలు నందమూరి , మెగా కుటుంబాలు సినిమాలు తీసి ఉన్నత స్థాయికి ఎదగాలని నందమూరి అభిమానులు మెగా అభిమానులు ఇలాంటి ఆస్కార్ అవార్డులు మరెన్నో తీసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి మండల ఉపఅధ్యక్షుడు పెద్దహ్యాట వీరేష్ మెగా అభిమానులు సిమెంట్ ఫజల్ ,వార్త రిపోర్టర్ విరుపాక్షి ,ముద్దుసూర్ 9టీవీ రిపోర్టర్ సాయిబేష్ ,సర్పంచ్ తనయుడు పంపాపతి, నందమూరి అభిమానులు తుంబలం సిద్ధప్ప, పెద్దహ్యాట శ్రీరంగ ,రారాయి సిద్ధూ, దిడ్డి తిక్కస్వామి ,ఎల్లార్తి మహేష్ ,సాయి అరుణ్ కుమార్ ,లక్ష్మన్న ,ఏరిస్వామి ,గోవిందు, రాజా మల్లికార్జున ,నందమూరి మెగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మద్దికేర రూరల్ : మంగళవారం కలియుగ ప్రత్యక్ష దైవం కోరిన కోర్కెలు తీర్చే దేవుడు ఆరోగ్య ప్రదాత కొలిచిన వారికి కొంగు బంగారు సంతాన ప్రాప్తి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విశేష పూజలు అర్చనలు పంచామృతాభిషేకాలు జరుపబడినది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తాదులు పాల్గొని తమ మొక్కలు చెల్లించుకున్నారు. అని ఆలయ నిర్వాహకులు ఎస్ విజయ ప్రసాద్ యాదవ్ తెలిపారు.

ఘనంగా సేవాలాల్ మారమ్మ జాతర

విశాలాంధ్ర-బనగానపల్లి : నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని రాళ్ల కొత్తూరు తాండ గ్రామంలో సేవాలాల్ మారమ్మ జాతర తాండ ప్రజలు ఘనంగా నిర్వహించారు. మారెమ్మ స్వామికి బోనాలు సమర్పించి జంతుబలులు గావించి ముక్కులు తీర్చుకున్నారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయ నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర - హెూళగుంద: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం నుండి ప్రారంభమయ్యే ప్రథమ ,ద్వితీయ ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసామని

పరీక్షల నిర్వహణ అధికారి శశి కుమార్ మంగళవారం తెలిపారు .ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షల్లో మొత్తం 535 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు, ప్రథమ సంవత్సరం ఇంటర్మీడి యట్ పరీక్షలో 107 మంది బాలురు 85 మంది బాలికలు పరీక్షలకు హాజరవుతారని అలాగే 20 మంది కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో 101 మంది బాలురు 66 మంది బాలికలు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీ జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని సీసీ కెమెరాలు బిగించామని విద్యార్థులకు త్రాగునీరు మరుగుదొడ్లు ,విద్యుత్ ,డెస్క్ సదుపాయం కల్పిస్తామన్నారు .విద్యార్థులు ఎలాంటి భయాందోళన చెందకుండా పరీక్షలను ఇష్టపడి రాయాలని కోరారు .పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అరగంట ముందు పరీక్ష భవనంలో హాజరు కావాల్సి ఉంటుందని, ఆలస్యంగా వస్తే అలాంటి విద్యార్థులకు పరీక్షలు రాసే అవకావం కోల్పోతారన్నారు.ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని ,ఇన్విజిటర్లు ,డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు ,చీఫ్ ,సూపర్వైజర్లు ,పరీక్షలను పర్యవేక్షిస్తారని పరీక్షలు జరిగే భవనాల్లో విద్యార్థుల డెస్కుకు నంబర్లు వేశామని , ప్రశ్నాపత్రాలు పోలీస్ స్టేషన్ లో భద్రపరిచామన్నారు. పరీక్షలు 15వ తేదీ నుండి ప్రారంభమై 29వ తేదీ వరకు కొనసాగుతాయని పరీక్షల నిర్వహణ అధికారి శశి కుమార్ పేర్కొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలపై నిర్లక్ష్యం తగదు

బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర- ఆస్పరి : రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల పై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని, ప్రస్తుత బడ్జెట్లోనైనా పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడంతో ప్రధానంగా కర్నూలు జిల్లా ఎడారిగా మారే పరిస్థితులు ఉన్నాయన్నారు. వాడుకోవడానికి సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం వైఎస్ జగన్ మేల్కొని ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో సాగునీటి ప్రాజెక్టులకు 15 శాతం నిధులు కేటాయించాలని, కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వేదావతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి రూ.1942 కోట్లు అవసరమని, ఇది పూర్తయితే 80 వేల ఎకరాలకు సాగునీరు, 180 గ్రామాలతో పాటు మరికొన్ని పట్టణాలకు త్రాగునీరు అందించవచ్చు అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో కేవలం 16 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిందన్నారు. జిల్లాలో ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్, సిద్దేశ్వరం అలుగు తదితర ప్రాజెక్టులకు ఏమాత్రం నిధులు కూడా లేవని అలాగే హంద్రీనీవా స్థిరీకరణ పనులు ఇంతవరకు పూర్తి కాలేదని, పంట పొలాలకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కర్నూలు జిల్లా విభజన జరిగిన

తరువాత రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లా గా కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉందని, ఇందులో పశ్చిమ ప్రాంతమైనా ఆదోని డివిజన్ వెనుకబాటుకు గురైన క్షామ పీడిత, దుర్భిక్ష ప్రాంతం గా తయారు కావడంతో నిరంతరం కూడా ఈ ప్రాంతం నుండి వలసలు కొనసాగుతున్నాయని. ఆవేదన వ్యక్తం చేశారు.

రాయలసీమ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి సీమ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోతే జగన్ కు భవిష్యత్తు లేదని, రాయలసీమ ద్రోహిగా మిగిలిపోతావన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణకు రూపకల్పన చేసి దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిమ్మన్న, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సీనియర్ నాయకులు రంగన్న, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని చిన్న కందుకూరు క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోహన్ రెడ్డి (50) అనే వ్యక్తి మరణించాడనీ పట్టణ పోలీసులు తెలిపారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తున్న మోహన్ రెడ్డి విధి నిర్వహణ కోసం మోటార్ సైకిల్ పై వెళ్తూ ఆర్టీసీ బస్సు కింద పడడంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మరణించాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చిన్న కందుకూరు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బంక మోహన్ రెడ్డి మృతి పట్ల ఉపాధి హామీ పథకం ఏపీవో గణేష్ విచారం వ్యక్తం చేశారు.

ఉల్లి రైతులు నష్టపోతున్నారు...

ప్రధానమంత్రికి పోస్టుద్వారా ఉల్లిగడ్డలు పంపిన రైతుసంఘం నేతలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఉల్లిని కర్నూలు మార్కెట్లో కిలో 5 రూపాయల ప్రకారం అమ్మి రైతు నష్టపోతున్నారని కావున కేంద్ర ప్రభుత్వం క్వింటాలకు 3000 వేలరూపాయల ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ, కర్నూలులో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఉల్లిగడ్డలు పోస్టల్ ద్వారా పార్సిల్ పంపించారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ఉల్లిగడ్డలు ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షత నిరసన తెలియచేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథంలు మాట్లాడుతూ రాష్ట్రంలోని కర్నూలు,నంద్యాల,కడప, అన్నమయ్య జిల్లాలలో ఉల్లి పంట ఖరీఫ్,రబీ సీజన్లో విస్తారంగా పండిస్తారన్నారు. చాలా ప్రాంతాలలో బోరుబావుల దగ్గర మరికొన్ని ప్రాంతాలలో వర్షాధారంగా సాగు చేస్తారని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో ఒక్క కర్నూలు జిల్లాలోనే 50 వేల ఎకరాలలో పంట సాగు చేశారన్నారు. . రాష్ట్రంలో కర్నూలు నుండి తాడేపల్లిగూడెంమార్కెట్‌కు ఉల్లి రవాణా చేస్తారని తెలిపారు. ఒక ఎకరాకు 1,20,000 వేల రూపాయల వరకు సాగు ఖర్చు అవుతుందని, వాతావరణం తో పాటు అన్ని రకాల పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 70 క్వింటాళ్లు దిగుబడి వస్తుందన్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతుల వద్ద క్వింటాళ్ళు 500రూ కొనుగోలు

చేస్తున్నారనిఆరోపించారు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పులపాలైతున్నారని తెలిపారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కిలో 3వేల రూపాయలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2017లో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లికి ఇంత వరకు రైతులకు డబ్బులు చెల్లించలేదని వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉల్లిని ఇతర దేశాలకు ఎగుమతి చేయాలని కేంద్రాప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభుఓష్యులు సభ్యులు నాగరాజు,బిసన్న, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవమాన హెూమం మహెూత్సవం

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

విశాలాంధ్ర - నంద్యాల : స్వస్తి శుభకృతనామ సంవత్సరం శశిర ఋతువు ఫాల్గున బహుళ సప్తమి మంగళవారము లోక

కళ్యాణార్థము, సంజీవనగర్ రామాలయంలో వెలసిన భక్తాంజనేయస్వామికి భగవత్ సేవా సమాజ్ వారి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాదస్వామి, సుధీంద్రాచార్యులు వారి అర్చకత్వంతో లక్ష తమలపాకుల, పవమాన హెూమం మహెూత్సవములు అత్యంత వైభవముగా జరిగినవి. స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం కలశస్థాపన, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ, గణపతి, నవగ్రహ దోయం, ఋగ్వేద, పవమానహెూమం, మహాపూర్ణాహుతి నిర్వహించబడింది. తదుపరి లక్ష తమలపాకులఅర్చన, సింధూర అర్చన, మహానైవేద్యం, మహామంగళహారతి, వేద ఆశ్వరచనములు నిర్వహించబడినది. ఈ పూజలో అనేక మంది భక్తాదులు పాల్గొన్నారు. వచ్చిన భక్తాదులందరికి భగవత్ సేవ సమాజ్వారు ప్రసాదం అందజేశారు.

నీటి దాహం తీరుస్తున్న ఎల్ఎల్సీ కాలువ

విశాలాంధ్ర-హెూళగుంద: సమ్మతగిరి ,గజ్జహళ్లి ,విరుపాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్సి ట్యాంకులు ,ఎల్ఎల్సీ నీటిని అధికారులు పంపించేసి గ్రామాల్లో మంచి నీటిని సరఫరా చేస్తున్నారు .ఎల్ఎల్‌సీ కాలువ ద్వారా ప్రజలకు సాగునీరు త్రాగునీరు సరఫరా అవుతున్నాయి పశువులకు ఎల్ఎల్సీ కాలువ ద్వారా నీటి దాహాన్ని పశువుల యజమానులు తీరుస్తున్నారు .ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవడం వల్ల జూన్ నెలలో ప్రారంభమైన కాలువ నీటి సరఫరా ఏప్రిల్ 10 వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. నిండుకుండలా ఎల్ఎల్సీ కాలువ ప్రవహిస్తున్నది కాలువలో నీటిమట్టం తగ్గకపోవడంతో ఆయకట్టు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు .ఎల్ ఎల్ సి కాలువలో నీటి సరఫరా సక్రమంగా ప్రవహించడం వల్ల సాగునీటికి ఇబ్బంది లేకుండా పోయిందని తుంగభద్ర రైతు సంఘం నాయకులు తెలిపారు .ఎల్ ఎల్ సి నీటి ద్వారా రబీ పంటలను రైతులు పండిస్తున్నారు .కాలువలో నీటి సరఫరా నిలిచిపోతాయని ఉద్దేశంతో అధికారులు ట్యాంకులు నీటిని పంపించేస్తున్నారు ఎల్ఎల్సీ కాలువ నీరు జలచౌర్యం కాకుండా తుంగభద్ర బోర్డు అధికారులు తుంగభద్ర ప్రాజెక్ట్ అధికారులు ముమ్మరంగా గస్తీ నిర్వహించారు . కాలువ నీటిని అక్రమంగా మళ్ళించుకోకుండా లష్కర్లు ,హెూంగార్డులు కాల్వ వెంబడి పెట్రోలింగ్ చేస్తున్నారు .ఆంధ్ర సరిహద్దు అయిన అనువాద వద్దకు ఆంధ్ర ఆయకట్టు రైతుకు అందాల్సిన నీటి వాటను అందించడానికి అధికారులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు .వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు పిల్లలు యువకులు కేరింతలు కొడుతూ సేద తీరుతున్నారు. గత సంవత్సరం సీసీ లైనింగ్ పనులు జరగడం వల్ల ఎల్ఐసి కాలువలో నీటి ప్రభావం అధికమైందని ఆయకట్టు రైతులు పేర్కొన్నారు .అలాగే నీటి సౌర్యం కూడా జరగకపోవడంతో అధికారులు ఊపిరిపించుకున్నారు .సీసీ లైనింగ్ వల్ల నీటి లీకేజీ నీటి వృధా కాకుండా పోయింది ఎల్ఎల్సి దిగు వ కాలువ నిండుకుండలా నీటితో కలకలాడుతూ ప్రవహిస్తున్నది.

పాదయాత్రీకుల సేవలో....

విశాలాంధ్ర - కోడుమూరు : ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల భ్రమరాంబిక,మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం కర్ణాటక రాష్ట్రం నుంచి వివిధ ప్రాంతాల నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో పాదయాత్రగా వెళుతున్న భక్తుల సేవలో కోడుమూరు వాసులు తరిస్తున్నారు. ముఖ్యంగా స్థానిక ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్ జి విశాలాక్షి ఎస్.జి శంకర్ బాబు దంపతుల సహకారంతో కర్ణాటక నుంచి వచ్చే పాదయాత్రికులకు గత కొన్నేళ్లుగా కర్నూలు రోడ్డులోని పరప్ప జిల్లా ఆవరణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు.ప్రతిరోజూ ఉదయం అల్పాహారము మధ్యాహ్నం,రాత్రి వేళల్లో భోజనం ఏర్పాట్లు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి.ఈ అన్నదాన కార్యక్రమం లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సదుపాయం తదితర సౌకర్యాలు అందిస్తారు.అలాగే తమ వంతు సేవగా మంగళవారం పట్టణానికి చెందిన నలుబోలు తేనేశ్వరరెడ్డి పట్టణ శివారు ప్రాంతంలోని కర్నూలు రోడ్డులో కాలినడకన వెళ్తున్న కన్నడ భక్తులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బిస్కెట్ ప్యాకెట్లు,లస్సి ప్యాకెట్లు పంపిణీ చేశారు.అలాగే సోమవారం నాడు బళ్లారి జిల్లా చందూరు తాలూకా డి అంతపుర గ్రామంలోని శ్రీశైల శాఖ మఠం పరమ పూజ్య కుమార పండితారాధ్య మహాస్వామి వారి ఆధ్వర్యంలో పల్లకి సేవ,121 అడుగుల ధ్వజ వస్త్ర ఆవిష్కరణతో వందలాదిమంది భక్తులు చేస్తున్న బృహత్తర పాదయాత్ర కోడుమూరు పట్టణానికి చేరుకున్న సందర్భంగా మండలంలోని వీరశైవ లింగాయతి సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో సురేష్ వెంకటేశ్వరరెడ్డి,బచ్చ గిద్దయ్య,మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీమాధవుడి రథోత్సవం

విశాలాంధ్ర - కోడుమూరు : జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన గోరంట్ల లక్ష్మీ మాధవుడి రథోత్సవ వేడుకలను భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సహిత లక్ష్మీ మాధవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆశేష జనవాహిని, భక్తుల మధ్య రథోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఈవో ఆధ్వర్యంలో ఆలయంలోని కొలువుదీరిన స్వామి,అమ్మవార్ల మూలవిరాట్ విగ్రహాలకు వేద పండితులు ఆలయ అర్చకులు వందవాసి రాధాకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఆగమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథాన్ని ప్రత్యేక పూలమాలలతో అలంకరించి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వేయించింపజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చి భక్తుల గోవిందా.. గోవిందా నామస్మరణల మధ్య రథోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.రథోత్సవం సందర్భంగా హిందూపురం ఎంపీ మాధవ్ కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లని దర్శించుకున్నారు. అలాగే మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి,కోట్ల కౌశిక్ రెడ్డి తదితరులు గోరంట్ల గ్రామానికి చేరుకొని రథోత్సవ వేడుకలలో పాల్గొన్నారు.వీరికి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తిరుమల నాయుడు ఆధ్వర్యంలో భారీ ఘన స్వాగతం పలికారు. రథోత్సవం వేడుకలు పురస్కరించుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సిఐ శ్రీధర్,ఎస్సై విష్ణు నారాయణల ఆధ్వర్యంలో గట్టు బందోబస్తు చేపట్టారు.

దర్శించుకున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి :

కాగా గోరింట లక్ష్మీ మాధవస్వామీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు జడ్పిటిసి రఘునాథరెడ్డి,సొసైటీ కన్వీనర్ బి కృష్ణారెడ్డిలు ఉదయం గోరంట్ల గ్రామంలోని ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామానికి చేరుకున్న కోట్ల హర్షకు గోరంట్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సద్దల శ్రీను,నాయుడు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కరెంటు మల్లారెడ్డి జిత్తూరు ప్రసాద్ తదితరులున్నారు.